క్లుప్తంగా

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న సర్పంచ్ మల్లయ్య

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేటకు చెందిన మారపాక సది, తాళ్లపల్లి రాజు ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాలకు సర్పంచ్ మంద మల్లయ్య శనివారం బియ్యం అందజేశారు. మారపాక సది కుటుంబానికి 50 కిలోల బియ్యం, తాళ్లపల్లి రాజు కుటుంబానికి క్వింటా బియ్యాన్ని అందజేశారు. మారపాక రవి, గర్వందుల సత్యం, వీరస్వామి, ఇల్లందుల యాదగిరితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

నర్మెట: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గైకాడి అనిల్ కుమార్ శనివారం తెలిపారు. వివరాలు.. జనగామ మండలం గానుగుపహాడ్ నుంచి నర్మెట మండలం వెల్దండకు అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న జంగిడి రాజు (డ్రైవర్), యజమాని జలందర్‌లపై కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమ రవాణాలు, సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

భోజ్యాతండా సర్పంచ్‌గా బానోత్ అంజయ్య



తరిగొప్పుల: కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య ఆదేశాల మేరకు మండలంలోని భోజ్యాతండా సర్పంచ్‌గా ప్రస్తుత ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్న బానోత్ అంజయ్యను నియమిస్తున్నటు డీపీఓ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్ భూక్య తిరుపతి నాయక్ వరకట్న వేధింపుల కేసులో నిందితుడిగా 14 రోజులు రిమాండ్‌లో ఉన్నందున అతని స్థానంలో ఉపసర్పంచ్ బానోత్ అంజయ్యకు సర్పంచ్‌గా నియమించారు.

చాకలి ఐలమ్మ మనుమరాలి మృతి



అండమ్మ(ఫైల్)

పాలకుర్తి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనుమరాలు అండమ్మ(80)అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. ఐలమ్మ రెండో కుమారుడు లచ్చయ్య కూతురు అండమ్మ కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా పనిచేశారు. అండమ్మ సాయుధ పోరాటంలో పాల్గొన్న ఐలమ్మకు సహాయ సహకారాలు అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. అండమ్మకు సీపీఎం జిల్లా నాయకులు చిట్యాల సోమన్న, సోమ సత్యం, రాయపర్తి కొమురయ్య, మనవళ్లు చిట్యాల యాకయ్య, చిట్యాల యాకయ్య(ఇంజనీర్), రాపర్తి మంజుల, మదార్, చిట్యాల సమ్మయ్య నివాళులర్పించారు.

భార్యపై హత్యాయత్నం



చికిత్స పొందుతున్న కల్పన

లింగాలఘణపురం: వివాహేతర సంబంధం పై ప్రశ్నించిన భార్యపై.. భర్త హత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మండలంలోని కళ్లెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కళ్లెం కనకయ్య అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం నెరుపుతున్నాడు. ఈ విషయం తెలిసిన కనకయ్య భార్య కల్పన.. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించింది. దీనిని జీర్ణించుకోలేని కనకయ్య.. శుక్రవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న కల్పనపై కత్తితో గొంతుపై పొడిచాడు. గాయాలపాలైన ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు లేచి ఆమె వద్దకు చేరుకున్నారు. అప్పటికే కనకయ్య పారిపోగా కల్పనను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై కల్పన తల్లి విములమ్మ ఫిర్యాదు మేరకు కనకయ్య, వివాహేతర సంబంధం నెరుపుతున్న మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రవీణ్ వివరించారు.

దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన



తరిగొప్పుల: దరఖాస్తులు పరిశీలిస్తున్న కార్యదర్శులు



నర్మెట: సర్వే చేస్తున్న ఎంపీఓ అరవింద్ చౌదరి



బచ్చన్నపేట: ఇంటింటి సర్వేలో కార్యదర్శులు

నర్మెట/తరిగొప్పుల/బచ్చన్నపేట/లింగాలఘణపురం: గృహలక్ష్మి పథకం కోసం పలు మండలాల్లో అందిన దరఖాస్తులను శనివారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టినట్టు అధికారులు తెలిపారు. కార్యదర్శులు, సంబంధిత సిబ్బంది గడపగడపకు వెళ్లి అర్జీదారుల స్థితిగతులను పరిశీలించి వివరాలు నమోదుచేస్తున్నారని, సర్వే పారదర్శకంగా నిర్వహించి అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామని వారు చెప్పారు. ఎంపీడీఓలు ఎండీ ఖాజామొహిఉద్దీన్, రఘురామకృష్ణ, సురేందర్, ఎంపీఓలు అరవింద్ చౌదరి, ఆలాం, కార్యదర్శులు కందకట్ల శ్రీధర్, ప్రవీణ్‌కుమార్, అనిల్, గణేష్, గిరి, వంశీ, యాకూబ్, కళ్యాణి సుజాత, భాగ్యలక్ష్మి, కొంకటి రవీందర్ తదితరులు ఉన్నారు.



లింగాలఘణపురం: ఇంటింటి సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ సురేందర్

ప్రజలు ఇచ్చే రెఫరెండానికి సిద్ధం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానికుడిగా తనకు ప్రజాబలం ఉందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే రెఫరెండంకు తాను సిద్ధమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఉద్వేగంగా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తులు, చేతివృత్తిదారులకు ఆర్థిక సహాయంగా అందించే రూ.1లక్షకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మాగార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారని, అందులో భాగంగా బీసీ కులాలలో కులవృత్తులు, చేతివృత్తిదారుల జీవితాల్లో వెలుగు నింపేలా రూ.1లక్ష ఆర్థిక సహాయం వంద శాతం సబ్సిడీతో అందించడం సర్వత్రా హర్షణీయమన్నారు. లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని, ఎలాంటి అవినీతికి ఆస్కారం లేదన్నారు.

సీఎం కేసీఆర్ దేవుడు.. నేను పూజారిని

తెలంగాణ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ దేవుడిలా వరాలు ఇస్తుంటే తాను పూజారిలా నియోజకవర్గ ప్రజలకు అనుసంధానంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. నియోజవకర్గ ప్రజల ఆశీర్వాదంతో వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యే అయ్యానని అన్నారు. నన్ను నమ్మిన వారి కోసం చివరి శ్వాస వరకు పనిచేస్తానని, అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. డీఆర్‌డీఓ గూడూరు రాంరెడ్డి, ఆర్‌డీఓ వాసం రామ్మూర్తి, జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖ, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.రవీందర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, చిల్పూరు దేవస్థాన చైర్మన్ శ్రీధర్‌రావు, ఏఎంసీ చైర్మన్ గుజ్జరి రాజు, స్థానిక సర్పంచ్ తాటికొండ సురేష్‌తో పాటు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు



పూజ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ రూరల్: మండలంలోని ఎర్రగొల్లపహాడ్‌లోని పులిగుట్టపై వెలిసిన లక్ష్మీనర్సింహస్వామికి శనివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి యజ్ఞం చేపట్టారు. వేద పండితులతో పూజా కార్యాక్రమాలు నిర్వహించగా, గ్రామస్తులు అధిక సంఖ్యలో వచ్చి హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొని గుట్టపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. గుట్ట అభివృద్ధికి పాటుపడుతానని, రోడ్డు ఏర్పాటు, ఇతర పనులు చేయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం గ్రామస్తులకు చిర్ర సత్యనారాయణ అన్నప్రసాద వితరణ చేశారు. సర్పంచ్ వంగాల రేణుక శంకర్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌ఈపీ 2020 విద్యావిధానం రద్దు చేయాలి



ఎస్టీఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

జనగామ రూరల్: కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం ఎన్‌ఈపీ 2020ని వెంటనే రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎస్టీఎఫ్‌ఐ 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, జయప్రకాష్, వెంకటేష్,నాగరాజు, కనకయ్య, ఆగయ్య, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

18న జిల్లా విద్యార్థి యువ గర్జన

జనగామ: జనగామ విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం ఈ నెల18వ తేదీన జిల్లా విద్యార్థి యువ గర్జన నిర్వహించడం జరుగుతుందని జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళ్లపల్లి రాజు తెలిపారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్యపోరాటాలే శరణ్యమన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాల్‌టెక్నిక్, నర్సింగ్, ఐటీఐలతో పాటు కేంద్రీయ విద్యాలయం, నవోదయ విద్యాలయాలను జిల్లాలో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ స్టడీ సర్కిల్స్‌ను వెంటనే ప్రారంభించాలన్నారు. 18వ తేదీన నిర్వహించ తలపెట్టిన విద్యార్థి యువ గర్జన రోజు విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు.

క్రీడాకారుడికి సత్కారం



క్రీడాకారుడిని సత్కరిస్తున్న సుగుణాకర్‌రాజు

జనగామ: తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో యూత్ ఫెస్టివల్‌ను పురస్కరించుకుని ఇటీవల హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన 5కె రన్‌లో పల్లగుట్టకు చెందిన క్రీడాకారుడు ఉదయ్ కిరణ్ జిల్లా తరుపున పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచాడు. రూ.25వేల నగదు పురస్కారం గెలుచుకన్న ఉదయ్‌కిరణ్ జాతీయ స్థాయి ఢిల్లీలో జరగనున్న పోటీలకు రాష్ట్రం తరుపున ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శనివారం విజేతగా నిలిచిన ఉదయ్ కిరణ్‌ని ప్రభుత్వ జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణార్‌రాజు ఘనంగా సత్కరించారు. ఆయన వెంట ఆర్‌టీ, ఐటీసీ కౌన్సిలర్ సతీష్, సహదేవ్, శ్రీధర్ ఉన్నారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలో ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్‌విగ్రహం వద్ద ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సంఘం జెండాను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు పస్తం పృథ్వీ, కార్యదర్శి చింత జగదీష్, నాయకులు ఎండీ.రహ్మతుల్లా, ఎండీ.యూనుస్ పాల్గొన్నారు.

‘కొమ్మూరి’కి భారీ స్వాగత ఏర్పాట్లు



మాట్లాడుతున్న నాయకులు

జనగామ: జనగామ డీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మొదటి సారిగా జిల్లాకు వచ్చే క్రమంలో పెద్ద ఎత్తున స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు చారబుడ్ల దయాకర్‌రెడ్డి, సర్వల నర్సింగరావు, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట రోడ్డులోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జనగామ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కొమ్మూరికి స్వాగతం పలికేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. జిల్లాలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసి కృషి చేస్తామన్నారు. జిల్లాకు కొమ్మూరి ఎప్పుడు వచ్చేదనే విషయమై తేదీని ఖరారు చేస్తామన్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్, నాయకులు లింగాల నర్సిరెడ్డి, దూడల సిద్దయ్య, ధర్మ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ బాలరాజు, సర్పంచ్ శ్రీలతశ్రీధర్, దాసరి శేఖర్, అనిల్, నరేందర్, రవి కుమార్, కొండల్ రెడ్డి, బుర్ర కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



పిచ్చిమొక్కల తొలగిస్తున్న సిబ్బంది

బచ్చన్నపేట: హరితహారంలో నాటిన ప్రతీ మొక్క ఎదిగి వృక్షంగా మారాలని, పంచాయతీలు ఆదిశగా అడుగులువేసి మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ తెలిపారు. మండలంలోని పలుగ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. ఆయాగ్రామాల్లోని పల్లెప్రకృతి వనాలు, రహదారులకు ఇరువైపులా, పాఠశాలలో, కార్యాలయాలలో హరితహారం సందర్భంగా నాటిన ప్రతీమొక్కను సంరక్షించాలని సూచించారు. వాడవాడలా పెరిగిన పిచ్చిమొక్కలను, చెత్తను, తొలగించి సైడ్ కాల్వలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న రమేష్

జనగామ రూరల్: ప్రతీ ఒక్కరు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్‌లో రెండో రోజు జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను సాంబరాజు యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ ఆలోచనపై బోధించారు. అనంతరం పార్టీ కార్యక్రమం దాని విశిష్టతను సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సోమయ్య బోధించారు. అనంతరం రమేష్ మాట్లాడారు. ప్రతి కుల వృత్తిలో వైజ్ఞానిక ఆలోచనలు ఇమిడి ఉన్నాయని సైన్స్‌పై విస్తృత పరిశోధనలు జరగాలన్నారు. తొమ్మిది ఏళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా సమస్యలు పరిష్కారంచడంలో పూర్తిగా విఫలమైందన్నారు. విభిన్న, వజీవ విధానాన్ని ధ్వంసం చేసి మనువాదాన్ని దేశంపై రుద్దడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. నాయకులు ప్రకాష్, గోపి. విజేందర్, రమేష్, వెంకటేష్, యాకయ్య, మహేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల సహకారంతోనే అభివృద్ధి



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ బక్క యాదగిరి

రఘునాథపల్లి: గ్రామస్తుల సహకారంతోనే గ్రామం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందని మండలంలోని రాయరాయనిబంగ్లా సర్పంచ్ బక్క యాదగిరి అన్నారు. శనివారం ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో మంజూరైన రూ.20 లక్షల జీపీ భవన నిర్మాణానికి సర్పంచ్ భూమి పూజ చేశారు. ఎంపీటీసీ బానోత్ భిక్షపతినాయక్, సర్పంచ్‌లు కొయ్యడ మల్లేష్, ముప్పిడి శ్రీదర్, పంచాయతీ కార్యదర్శి బస్వరాజ్ మౌనిక, ఉప సర్పంచ్ మమత సుదీర్, మేరుగు కర్ణాకర్, మద్దెల లక్ష్మి, తోట అనిత, మేరుగు పద్మ, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, వెంకటేష్, రమేష్, కుమారస్వామి పాల్గొన్నారు.

అందరివాడు ‘పొన్నాల’

- అన్ని కులాలకు సమ ప్రాధాన్యం
- టీపీసీసీ కార్యదర్శి ధర్మ సంతోష్‌రెడ్డి



మాట్లాడుతున్న ధర్మ సంతోష్‌రెడ్డి

జనగామ: టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య హయాంలో పార్టీ, నామినేటెడ్ పోస్టులు, ప్రజా ప్రతినిధులుగా రెడ్డి, బీసీ, అన్ని కులాలకు సమప్రాధాన్యం కల్పించాడని టీపీసీసీ కార్యదర్శి ధర్మ సంతోష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పొన్నాల క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, రెడ్డి సామాజిక వర్గాలకు చెందిన అనేక మందికి గౌరవ ప్రదమైన హోదాలు కల్పిస్తే, ఇప్పుడు ఆయనను బదునాం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. జనగామ డీసీసీ అధ్యక్ష పదవి కోసం 12 మండలాల కార్యకర్తల అభిప్రాయాలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీ కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇక్కడ ఎవరు పని చేశారో ఆయనకు తెలుసన్నారు. అలాంటి సమయంలో జిల్లా అధ్యక్షపదవి కట్టబెట్టే సమయంలో తమ అభిప్రాయాలను ఎందుకు వద్దనుకున్నారో తెలియదన్నారు. రేవంత్‌రెడ్డి టీపీసీసీగా నియామకమైన సమయంలో ఆయనకు వెన్నంటి ఉంటూ పొన్నాల భరోసా ఇచ్చాడన్నారు. బీసీ వర్గం కోసం పొన్నాల గళమెత్తింది ఆయన ఒక్కరి కోసం కాదని, తన సామాజిక వర్గానికి ఎక్కువ ప్రాధాన్యత దక్కాలన్న ఉద్దేశ్యంతోనే ముందడుగు వేశాడన్నారు. పొన్నాల ఆశీస్సులతో పదవులు వెలగబెట్టిన వారంతా వ్యతిరేకం చేస్తున్నారని, తమకు అలాంటి కుట్రలు, కుతంత్రాలు రావన్నారు. కొమ్మూరికి జిల్లా అధ్యక్షపదవి వచ్చిన సమయంలో తాము ఏ ఒక్కరోజు కూడా వ్యతిరేక కామెంట్స్ చేయలేదని, కానీ కొంత మంది ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. నియోజకవర్గంలో సభ్యత్వ నమోదుకు మండలాల వారిగా కార్యకర్తల వద్దకు వెళ్తే ఎవరెవరు తిరిగారో చెబుతారన్నారు. పిన్నింటి నారాయణరెడ్డి, జాఫర్ షరీఫ్ నిడిగొండ శ్రీనివాస్, కొన్నె మహేందర్ రెడ్డి, వంచ వెంకట్ రెడ్డి, బడికే కృష్ణ, యాట క్రాంతి, రాజిరెడ్డి, కట్ట కృష్ణ, యాసిన్, బాల్నే నరేష్, నిఖిల్, శివ, రాజు పాల్గొన్నారు.

సెల్‌టవర్ జనరేటర్‌లో అగ్నిప్రమాదం



జనగామ: జిల్లా కేంద్రం బాలాజీనగర్‌లోని ఓ సెల్‌టవర్ జనరేటర్‌లో శనివారం ప్రమాదవ శాత్తు మంటలు చెలరేగడంతో కాలనీ వాసులు ఉలిక్కి పడ్డారు. అగ్నిమాపక శాఖకు ఫోన్ చేసి సమాచారం అందించగా, వారు వచ్చి మంటలను ఆర్పేశారు. అప్పటికే జనరేటర్ పూర్తిగా దగ్ధం కాగా, సుమారు రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు. నివాస గృహాల మధ్య సెల్‌టవర్‌లను తొలగించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కాలనీ వాసులు కోరారు.

కూలిన ఇంటిని తొలగించండి



కూలిన ఇల్లు, (ఇన్‌సెట్‌లో) పాములు

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్‌లోని 1వ వార్డులో కూలిన ఇంటిని తొలగించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు. వార్డులో చాలా ఏళ్ల క్రితం చొప్పరి రాజుకు చెందిన ఇల్లు కూలిపోయింది. అదే సమయంలో కూలిన ఇంటిని తొలిగించాలని పంచాయతీ ఉద్యోగులు ఆదేశించినా పట్టించుకోకపోవడంతో చెట్లు పెరిగి పాములు చేరి జనావాసాలు, ఇళ్లలోకి అవి వస్తున్నాయని తెలిపారు. రాత్రి వేళల్లో బయటకు రావాలంటే భయమేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కుక్కలు, పిల్లులు ఇళ్లలోని కోళ్లను కూలిన ఇంట్లోకి ఎత్తుకెళ్తున్నాయని చెప్పారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి ఆ ఇంటిని తొలిగించాలని కోరుతున్నారు.

‘చలో హైదరాబాద్’కు తరలిన ఉద్యోగులు



వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎన్నమనేని జగన్‌మోహన్ రావు

హన్మకొండ: పాత పెన్షన్ సంకల్ప సాధన సభలో పాల్గొనేందుకు ఉద్యోగులు హైదరాబాద్ తరలివెళ్లారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ వద్ద ఉద్యోగులు వెళ్తున్న వాహనాలను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్ రావు, రాష్ట్ర నాయకుడు కిరణ్‌కుమార్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. 50 బస్సుల్లో 3వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగుల హక్కు అని, ప్రభుత్వం మానవతా దృష్టితో పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.జీవన్‌కుమార్, కొండా శ్రీనివాస్, షేక్ అఫ్జల్, లెక్కల వీరేశం, డాక్టర్ వెంకటస్వామి, రాజు పాడ్యా, కుమారస్వామి, చేతన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్స్ డే

విద్యారణ్యపురి: గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ 131వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్స్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, లైబ్రేరియన్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ధర్మేంద్ర మాట్లాడుతూ టెక్నాలజీకి అనుగుణంగా గ్రంథాలయాలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. రంగనాథన్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలలో రిటైర్డ్ అయిన రాజన్‌బాబును, ఇటీవల గ్రంథాలయ శాస్త్రంలో డాక్టరేట్ పొందిన కేడీసీ లైబ్రేరియన్ పల్లెర్ల శంకరయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ రాజేశ్వర్‌కుమార్, సీనియర్ లైబ్రేరియన్ అశోక్‌కుమార్, పలు కళాశాలలకు చెందిన గ్రంథపాలకులు హాలునాయక్, సారంగపాణి, గీత, వనమాల తదితరులు ఉన్నారు.